సాక్షి నంద్యాల

బుధవారం । 14 । ఆగస్టు । 2024



స్పిల్‌వే నుంచి నీటి విడుదల

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని స్పిల్‌వే నుంచి రెండు గేట్లు ఎత్తి గాలేరుకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ శివనాయక్ తెలిపారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై మంగళవారం వైఎస్సార్ జల్లా సాయి నటరాజ డాన్స్ అకాడమీ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు, శ్రీబయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో 3వ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల ఫిట్టర్, టర్నర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఏడాది మెకానికల్ డీజిల్, వెల్డర్ కోర్సులలో సీట్లు ఉన్నాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులనీ, వెల్డర్ కోర్సుకు పదవ తరగతి ఫెయిల్ అయిన వారు కూడా అర్హులని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈనెల 26వ తేదీలోగా www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని, 29 జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 08524-286055, 9703395091, 9441181072, 9908993910 సంప్రదించాలన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సుల తనిఖీ



బస్సును తనిఖీ చేస్తున్న ఆర్‌టీఓ అధికారులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ఆత్మకూరు, డోన్, నందికొట్కూరు, నంద్యాల ప్రాంతాల్లో మంగళవారం జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌టీఓ అధికారులు ప్రైవేటు పాఠశాల బస్సులను తనిఖీ చేశారు. అనుమతులు లేని బస్సులు 3, ట్యాక్స్‌లు చెల్లించని 4 బస్సులు, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మరొక బస్సును అదుపులోకి తీసుకొని జరిమానా విధించినట్లు డీటీఓ తెలిపారు. ట్యాక్స్, ఫెనాల్టీ, సీఎఫ్ కలిపి రూ.77,250 జరిమానా వేసినట్లు తెలిపారు. వాహనాలు లైసెన్స్‌లు లేకుండా నడిపితే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో నంద్యాల, డోన్, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన అధికారులు రవిశంకర్, సుబ్బయ్య, ప్రదీప్‌రెడ్డి, నాగేంద్ర, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

మిడుతూరు: బాల్యం నుంచి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వహకులు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం పీరుసాహెబ్ పేట గ్రామంలోని రామాలయంలో నాలుగు రోజుల పాటు ధార్మిక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో నైతిక విలువలు తగ్గిపోతున్నాయన్నారు. బాల్యం నుంచే మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, గురువుల పట్ల భక్తి భావం ఉండాలన్నారు. హిందూ సంప్రదాయాలను మరుగున పడకుండా సంస్కృతిని సంరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు రవితేజ, ధర్మ ప్రచారకులు రామ్మోహన్, గ్రామ పెద్దలు చంద్రపుల్లారెడ్డి, రఘురామిరెడ్డి, రాజశేఖర రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో సెంట్‌యాన్స్ ప్రైవేటు పాఠశాల

ఫ్రీ సీటు.. ఫీజు పోటు

పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య అందించాలనే విద్యా హక్కు చట్టానికి జిల్లాలో తూట్లు పడుతున్నాయి. 'రాష్ట్రంలో ప్రభుత్వం మారింది, ఉచిత సీట్లు పథకం కొనసాగిస్తారో.. లేదో' అంటూ ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. 'విషయం తేలే వరకు ఏమీ చెప్పలేం.. మాకు అనుకూలంగా జీవో వస్తే ఫీజులు కట్టాల్సిందే' అని ఒప్పంద పత్రాలు రాయించుకుని సంతకాలు పెట్టించుకుంటున్నాయి. దీంతో అనేక మంది ఎందుకొచ్చిన సమస్య అని మళ్లీ ప్రభుత్వ పాఠశాలలలో తమ పిల్లలను చేర్పుతుండగా, మరి కొందరు ఈ విద్యా సంవత్సరం ఫీజు భారం భరించాల్సిందేనంటూ ఆందోళన చెందుతున్నారు.

- ఉచిత విద్యకు ప్రైవేట్ విద్యా సంస్థల తూట్లు
- ఫ్రీ సీటు మంజూరైనా ఫీజు కట్టాల్సిందేనని ఒత్తిడి
- ఒప్పంద పత్రాలపై సంతకాలతోనే సీటు
- పేద విద్యార్థుల తల్లిదండ్రులపై భారం
- చోద్యం చూస్తున్న అధికారులు


ఆళ్లగడ్డ: 'అక్షర జ్ఞానంతోనే పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచవచ్చు' అనే సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది. పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలో పైసా ఖర్చు లేని ఉచిత విద్యను అందించేందుకు బంగారు బాటలు వేసింది. ఏటా ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణతో ప్రారంభించి అర్హులైనవారికి సీట్ల కేటాయింపు, ఎంపికైన విద్యార్థులు పాఠశాలల్లో చేరే వరకు ప్రతి దశలో పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఫలితంగా రెండు సంవత్సరాలు ఈ పథకం పక్కాగా అమలైంది. అయితే రెండు నెలల క్రితం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యపై నీలినీడలు అలుముకున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన చిన్నారులతో పాటు దివ్యాంగులకు కచ్చితంగా 25 శాతం సీట్లు కేటాయించాల్సింది ఉండగా యాజమాన్యాలు సీట్ల భర్తీకి నిరాసక్తత చూపుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం ఈ ఏడాది ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థుల ఫీజు చెల్లిస్తుందో లేదోనని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు సందిగ్ధత వ్యక్తం చేస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికే చేర్పించిన వారు సైతం కొందరు మధ్యలో ఫీజులు కట్టాల్సి వస్తుందని భయపడి మళ్లీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ సూళ్లు అన్నింటిలోనూ ప్రతి విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో తప్పనిసరిగా 25 శాతం సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించాలి. ఇందులో అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధిత పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఇతర వర్గాలకు 6 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంది. అయితే 2024-25 విద్యా సంవత్సరం మూడు విడతల్లో ఎంపిక చేసిన సీట్లను పరిశీలిస్తే ఎక్కడా కూడా నిబంధనలు పాటించినట్లు కనిపించడం లేదు. నంద్యాల జిల్లాలో 500 పైగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో నిబంధనల ప్రకారం 25 శాతం సీట్లు కేటాయిస్తే కనీసం 10 వేల మంది పిల్లలకు ప్రవేశం కల్పించవచ్చు. అయితే ఈ ఏడాది దరఖాస్తు చేసుకున్నదే 1,862 మంది అయితే అందులో మూడు విడతలుగా వడపోసి కేవలం 945 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఇక ఈ విద్యా సంవత్సరానికి ఇంతే అని అధికారులు చేతులు దులుపుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

సగమన్నా చెల్లించండి..

ఆళ్లగడ్డ పట్టణ శివారులోని పడకండ్ల ఎస్సీ కాలనీకి చెందిన ఒంటరి మహిళ తన కూతురుకు ఉచిత విద్య సీటు వచ్చిందని సచివాలయ సిబ్బంది తెలపడంతో సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో చేర్పించింది. పుస్తకాలు, యూనిఫాం ఇతర వాటికి కలిపి సుమారు రూ. 4,500 కట్టించుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారిందని, ఉచిత విద్య జీఓ అమలు చేయడం లేదని, అందరూ చెల్లించే ఫీజులో సగమైనా కట్టాలని స్కూలు యాజమాన్యం ఒత్తిడి చేస్తుందని మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఫీజు భారమై..

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీటు పొందిన విద్యార్థులు ఏడాదికి ఎంత ఫీజు చెల్లించాలనేది ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. పట్టణాల్లో రూ. 8 వేలు, రూరల్‌లో రూ. 6,500, గిరిజన ప్రాంతాల్లో రూ. 5,100 చొప్పున అడ్మిషన్ పొందిన ప్రైవేటు పాఠశాలలకు గత ప్రభుత్వం నేరుగా చెల్లించింది. అయితే ఈ ప్రభుత్వం ఫీజుల చెల్లింపుల గురించి ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. దీంతో ఉచిత విద్యా హక్కు చట్టం కింద చేరిన పిల్లలకు యాజమాన్యాలు విద్య సక్రమంగా అందిస్తుందా ..? లేదా అనే సందేహాలు వినిపిస్తున్నాయి. దీంతో చాలా మంది ఈ ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడం కన్నా.. ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవనే అభిప్రాయానికి వస్తున్నారు. ఇంత జరుగుతున్నా విద్యా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.



మొదటి కంతు కట్టండి

ఆళ్లగడ్డలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో ఓ మహిళ కుమారుడికి ఫ్రీ సీటు రావడంతో చేర్పించింది. సీటు ఫ్రీ అయినా పుస్తకాలు, యూని ఫాం, ఇతర వస్తువులకు సబంధించి సుమారు రూ. 12 వేలు ఖర్చు చేసింది. ఇప్పుడు సీటు ఫ్రీ కాదు.. ఫీజు చెల్లించాలని, మొదటి కంతు కింద రూ. 7 వేలు వెంటనే చెల్లించాలని నోట్ రాసి పంపించడంతో విద్యార్థి తల్లి కంగుతింది.

జిల్లాలో ప్రైవేటులో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థుల వివరాలు		
విడత	ఎంపికైన విద్యార్థులు	చేరిన విద్యార్థులు
మొదటి	960	736
రెండవ	302	201
మూడవ	25	17
మొత్తం	1,287	945

చట్టం నిర్వీర్యం



కార్పొరేటు స్కూళ్లలో తమ పిల్లలను చదివించుకోవాలనే ఆశ పేద తల్లిదండ్రులకు ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యా హక్కు చట్టం 2009 (12(1)(సి) అమల్లోకి తీసుకువచ్చారు. చట్టం అమలు గురించి పట్టించుకోక పోవడంతో పేదలు అనేక మంది ఆశ ఉన్నా కార్పొరేట్ విద్యకు దూరం కావల్సిన దుస్థితి నెలకొంది. అనేక స్కూళ్లలో ఉచిత విద్య అని అడ్మిషన్లు ఇచ్చి ఫీజు కట్టమని వేధిస్తున్నారు. అలాంటి స్కూళ్లపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి

– వెంకట్, రాయలసీమ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

నిబంధనలు అతిక్రమిస్తే గుర్తింపు రద్దు చేస్తాం



జిల్లాలోని ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించడం జరిగింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత సీటు పొందిన వారికి ఉచితంగా అడ్మిషన్ ఇవ్వాల్సిందే. దీనిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఎంఈఓలకు ఆదేశాలు ఇచ్చాం. ఎంపికైన వారిని చేర్చుకోబోమని అడ్మిషన్లు తిరస్కరించినా, ఫీజు చెల్లించాలని వేధించినా నిబంధనల మేరకు పాఠశాల గుర్తింపును రద్దు చేస్తాం.

– సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్) ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశభక్తి ఉట్టిపడేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా'ను పురస్కరించుకుని పర్యాటకశాఖ ఆధ్వర్యంలో టెక్కె మార్కెట్ యార్డు నుంచి గాంధీ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశమంతా ప్రజలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి పునరంకితమవ్వాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 78వ స్వాతంత్ర వేడుకల సందర్భంగా స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను భావితరాలు స్మరించుకునేలా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాట్లాడుతూ www. harghar tiranga.com హర్ ఘర్ తిరంగ వెబ్‌సైట్లో ప్రతి ఒక్కరూ జాతీయ జెండాతో సెల్ఫీ దిగి అప్లోడ్ చేసి సర్టిఫికెట్ కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఏ.పద్మజ, పర్యాటక అధికారి సత్యనారాయణ, ఆర్డీవో శివారెడ్డి, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, జిల్లా అధికారులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): రైతుల భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పంట రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి కేంద్ర సహకార బ్యాంక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద చేపట్టిన మల్టీపర్పస్ గోడౌన్లు, లార్జెస్ట్ గ్రైన్ స్టోరేజ్ నిర్మాణాల్లో నెలకొన్న సమస్యలను అధిగమించాలన్నారు. జిల్లాలో చేపట్టే పశుగణనలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి గోవిందనాయక్‌కు సూచించారు. జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సహకార బ్యాంకుల కంప్యూటీకరణ 20 శాతం పూర్తయిందని, అక్టోబర్ 2 నాటికి 56 సంఘాలలో కంప్యూటీకరణ పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధికారులు శివలీల, వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, డీపీఓ మంజుల వాణి, మత్స్యశాఖ డీడీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

భారీగా సీఐల బదిలీ



కర్నూలు(టౌన్):కర్నూలు,అనంతపురం జిల్లాల రేంజ్ పరిధిలో భారీగా సీఐల బదిలీలు చేపట్టారు. మొత్తం 62 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

కర్నూలు జిల్లాకు సంబంధించి..		
సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
రామయ్యనాయుడు	త్రీటౌన్, కర్నూలు	వన్‌టౌన్ అర్బన్, కర్నూలు
వై.పవన్‌కుమార్	వన్‌టౌన్, కర్నూలు	ఫ్యాక్షన్ జోన్
బి.మధుసూదన్‌గౌడ్	సీఐడీ	ఫోర్త్‌టౌన్, కర్నూలు
పి.శంకరయ్య	ఫోర్త్‌టౌన్	వీఆర్
ఎం.తబ్రేజ్	అనంతపురం వీఆర్	కోడుమూరు
ఎస్.మన్సూరుద్దీన్	కోడుమూరు	వీఆర్
బి.శ్రీనివాసులురెడ్డి	డీఎస్‌బీ-2	నంద్యాల రూరల్
జి.ఇబ్రహీమ్	టూటౌన్, కడప	సీసీఎస్, కర్నూలు
ఎం.శ్రీనాథ్‌రెడ్డి	వీఆర్, కడప	డీఎస్‌బీ-2
వి.శ్రీనివాసులు	వీఆర్	సోషల్ మీడియా, సైబర్‌క్రైం సెల్
ఎ.వేణుగోపాల్	సోషల్ మీడియా, సైబర్‌క్రైం సెల్	వీఆర్
ఆదిలక్ష్మమ్మ	వీఆర్	మహిళా పీఎస్
డి.హాజీవలి	మహిళా పీఎస్	ట్రాఫిక్, పులివెందుల
ఎల్.విజయలక్ష్మి	పీసీఆర్, ఆదోని	డీటీఆర్‌బీ
ఎ.ఆదినారాయణరెడ్డి	డీటీఆర్‌బీ	వీఆర్

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ తెలిపారు. ఏపీ ఎస్ఏహెచ్‌పీసీ ఇన్‌చార్జ్, డీఎంఈ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. దరఖాస్తులు www. appmb. co.in లేదా appsahpc. co. in వెబ్‌సైట్ నుంచి ఈ నెల 18వ తేదీ వరకు లభిస్తాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించి మెడికల్ కాలేజీలో అందజేయాలన్నారు.

ఇళ్లపై 'పచ్చ'పాతం

- ఇళ్ల నిర్మాణ వ్యయాన్ని పెంచిన కూటమి ప్రభుత్వం
- కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారికేనంటూ మెలిక
- పార్టీలకతీతంగా పేదలందరినీ అర్హులను చేసిన వైఎస్ జగన్
- ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఉన్న లబ్ధిదారులకు చంద్రబాబు ప్రభుత్వం మొండిచేయి

'పచ్చ'పాతం సర్కారు పేదల ఇళ్లపైనా తమ ప్రతాపం చూపుతోంది. ఇటీవల ప్రకటించిన ప్రభుత్వ ఇళ్ల ప్రకటనలోనూ మెలిక పెట్టింది. పెంచిన యూనిట్ కాస్ట్ కొత్తగా ఇళ్లు నిర్మించుకునేవారికేనంటూ కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై నిర్మాణాలు సాగిస్తున్న పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. తామేమి పాపం చేశామంటూ శాపనార్థాలు పెడుతున్నారు.



నందికొట్కూరు సమీపంలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



డోన్ సమీపంలో నిర్మించిన జగనన్న కాలనీ

నందికొట్కూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున జిల్లాలోని 46,722 ఇళ్లకు నిధులు విడుదల చేసింది. జగనన్న కాలనీల పేరుతో ఊళ్ల నిర్మాణమే చేపట్టింది. అయితే ఆర్థిక పరిస్థితులు అనుకూలించకో.. మరే కారణముతోనే కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోలేదు. ఇంకొందరి ఇళ్ల నిర్మానాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు నిర్మాణ వ్యయాన్ని రూ.1.80 లక్షల నుంచి రూ.4లక్షలకు పెంచారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.2.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.1.50 లక్షలు కేటాయిస్తునట్లు వెల్లడించారు. దీంతో ఇళ్ల లబ్ధిదారులు ఎంతో సంతోషించారు. అయితే 2024-25 పీఎంఏవై-యూ 2.0 పథకానికి సంబంధించి నిబంధనల్లో కొత్తగా ఎంపిక చేసే లబ్ధిదారులకు మాత్రమే పెంచిన వ్యయం వర్తిస్తుందని పొందుపరచడంతో గత ప్రభుత్వంలోని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. తమకు కూడా కొత్తగా ప్రకటించిన రూ.4 లక్షల సాయం వర్తించేలా చూడాలని కోరుతున్నారు.

నిబంధనలతో లబ్ధిదారుల ఆందోళన

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో పేదల కోసం 46,722 ఇళ్లను మంజూరు చేసింది. అందులో 26,513 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ఇక రూఫ్ కాస్ట్-820, రూఫ్ లెవల్-1768, బేస్‌మెంట్ లెవల్-9, 160 ఉన్నాయి. వివిధ కారణాలతో 8,459 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోలేకపోయారు. వీరికి కూటమి ప్రభుత్వం నిబంధనల ప్రకారం కొత్తగా పెంచిన రూ.4 లక్షల సాయం అందే పరిస్థితి లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



జూపాడుబంగ్లాలో నిర్మాణ దశలో ఇళ్లు

వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన ఇళ్ల వివరాలు	
జిల్లాకు మంజూరైన గృహాలు	6,722
పూర్తయినవి	26,513
రూఫ్ కాస్ట్‌కు చేరుకున్నవి	820
రూఫ్ లెవల్‌లో కొనసాగుతున్నవి	1768
బేస్‌మెంట్ లెవల్ కొనసాగుతున్నవి	9,160
నిర్మాణాలు ప్రారంభించనివి	8459

శ్లాబ్ వరకు నిర్మించుకున్నాం



జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి పక్కా గృహం మంజూరు చేశారు. శ్లాబ్ వరకు నిర్మాణం జరిగింది. ఆర్థిక స్తోమత లేక నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. నాతో పాటు నా కొడుకు, కోడలు, చిన్నకొడుకు కలిసి ప్రస్తుతం అద్దె ఇంటిలో నివసిస్తున్నాం. ఇప్పటికే రూ.1.60 లక్షల వరకు బిల్లు గత ప్రభుత్వం ఇచ్చింది. చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన రూ.4 లక్షలు వర్తింపజేస్తే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని సొంతింట్లోకి వెళ్తాం.

– నూర్జహాన్, నందికొట్కూరు టౌన్

అధికారుల సమయాన్ని వృథా చేయొద్దు

- పీఎంజీఏవై నిధులకు మండలపరిషత్ తీర్మానం అవసరం లేదు
- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, చిత్రంలో ఎంపీపీ సువర్ణమ్మ

జూపాడుబంగ్లా: సరైన సమాచారం లేకుండా ప్రజా ప్రతినిధులు అధికారుల సమయం వృథా చేయవద్దని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. ఎంపీపీ సువర్ణమ్మ స్థానిక ఎంపీడీఓ నూర్జహాన్‌పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం నాసరరెడ్డి జూపాడుబంగ్లాకు చేరుకొని విచారణ చేపట్టారు. జనరల్ ఫండ్ నిధులతో మండల పరిషత్ తీర్మానం లేకుండా పి.లింగాపురం గ్రామంలో ప్రధాన మంత్రి గ్రామీణ ఆదర్శ యోజన కింద డ్రైనేజీ కాల్వల నిర్మాణం చేపట్టారని, అనుమతి లేకుండా సచివాలయ ఉద్యోగుల శిక్షణకు రూ.66 వేలు డ్రా చేశారని ఎంపీపీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ రికార్డులను పరిశీలించారు. పీఎంజీఏవై నిధులకు సంబంధించి ప్రత్యేక బ్యాంకు ఖాతా, రికార్డుల్లేకుండా ఎలా నిర్వహించారని ఎంపీడీఓ నూర్జహాన్‌ను ప్రశ్నించారు. పీఎంజీఏవై పథకం కింద మంజూరైన రూ.10 లక్షల నిధులు జనరల్‌ఫండ్ ఖాతాలో జమ చేశారని, ఇందుకు మండల పరిషత్ తీర్మానం అవసరం ఉండదని ఎంపీపీ సువర్ణమ్మకు తెలిపారు. జనరల్ ఫండ్ డ్రా చేసుకునేందుకు తీర్మానం అవసరం లేదన్నారు. అయితే విషయాన్ని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లి నిధులు డ్రా చేసి ఉండాల్సిందని సీఈఓ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నూర్జహాన్‌కు సూచించారు. ఇకపై ఇరువురు సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

క్లుప్తంగా

అక్రమ మైనింగ్‌పై కొరడా

● రెండు టిప్పర్లు సీజ్

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (టౌన్): ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో అక్రమ మైనింగ్‌పై గనుల శాఖ అధికారులు స్పందించారు. మైనింగ్ పనులు నిలిపివేశారు. అక్రమ మైనింగ్‌పై సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'పూడిచెర్ల కొండకు గుండు' అన్న వార్త కథనం ప్రచురితమైంది. అక్రమంగా కొండను కొల్లగొడుతున్నట్లు పత్రికల్లో రావడంతో మైనింగ్ అధికారులు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ దిలీప్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూడిచెర్ల గ్రామంలో సర్వే నంబర్ 372 లో అక్రమంగా మైనింగ్ చేసినట్లు వెలుగులోకి వచ్చింది.అనుమతులు లేకుండా క్వారీ నిర్వహిస్తున్నట్లు స్పష్టం కావడంతో గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి ఓర్వకల్ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు జిల్లా మైనింగ్, భూగర్భ శాఖ ఉప సంచాలకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణ జరిపి శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

దంపతులను ఢీకొట్టి వెళ్లిపోయిన వాహనం

● మహిళ మృతి, భర్తకు తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన చందు

చిప్పగిరి: బైక్‌పై వెళుతున్న దంపతులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో మహిళ మృతి చెందగా ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నేమకల్లు గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన శికారి సుగుణ, చందు దంపతులు. మండలంలోని రామదుర్గం వద్ద పొలం పని చేసేందుకు టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్‌పై వెళుతున్నారు. ఆలూరువైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో దంపతులు తీవ్ర గాయాలపలయ్యారు. సుగుణ అక్కడికక్కడే మృతి చెందగా భర్త చందుకు కాలు విరిగింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, మేనిజింగ్ డైరెక్టర్ కే.సంతోష్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన కొత్తబస్టాండు సమీపంలోని విద్యుత్ భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని విద్యుత్ ఈఈ, డీఈ, ఏడీ, ఏఈలతో నిర్వహించిన సమీక్షలో పాల్గొని విధి విధానాలను వివరించారు. సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను ఏ విధంగా నివారించుకోవచ్చనే విషయమై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ బిల్లుల బకాయి లేకుండా 100 శాతం వసూలు చేయాలని, ఆదివారం వంటి సెలవు రోజుల్లో కూడా వసూలు కేంద్రాలు తెరచి ఉంచాలన్నారు. అధికారులు, విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు పనిచేసే చోటనే నివాసం ఉండాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ విద్యుత్ అంశాలను ఎస్ఈ ఉమాపతి వివరించారు. సమావేశంలో ఏపీఎస్‌పీడీసీఎల్ సీజీఎం(రెవెన్యూ) ధర్మజ్ఞాని, సీజీఎం(ఓఅండ్ఎం) ఆర్.పద్మ, ఈఈలు ఓబులేసు, శేషాద్రి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చిన్న రాఘవులు, డీఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సౌరభం





కొండారెడ్డి బురుజుకు తిరంగా లైటింగ్ షో



జాతీయ జెండా రంగులతో లోకాయుక్త కార్యాలయం

సొంతంత్ర్య వేడుకలకు నగరం ముస్తాబయ్యింది. ఆయా శాఖల పరిధిలో పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చారిత్రక కట్టడాలు, ప్రాచీన భవంతులు, ఆయా శాఖల కార్యాలయాలకు జాతీయ జెండా రంగులతో లైటింగ్ షో ఏర్పాటు చేశారు. జిల్లాకే తలమాణికమైన కొండారెడ్డి బురుజుకు త్రివర్ణ శోభితంగా లైటింగ్ ఏర్పాటు చేయడంతో చూపరులను అమితంగా ఆకట్టుకుంటోంది. నాటి స్వాతంత్ర్య సంగ్రామంలో జిల్లా ప్రాశస్త్యాన్ని, అమర వీరుల త్యాగాలను గుర్తుకు తెస్తూ సజీవ సాక్ష్యంగా ఈ కట్టడం నిలుస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

అమృత్ సరోవర్‌ల వద్ద పంద్రాగస్టు వేడుకలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేసిన చెరువుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయడంతో పాటు వివిధ దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమరనాథరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పంద్రాగస్టు వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు. జిల్లాలో 80 చెరువులను అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేశామని, ఈ చెరువుల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని, చెరువు గట్టు, ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమానికి స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ సిటిజన్‌లు, విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. తిరంగా యాత్ర పేరు ర్యాలీలు నిర్వహించాలని, దేశభక్తి గీతాలు ఆలపించాలని సూచించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 15న కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

టీడీపీ గూండాల అరాచకం

● వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం.
● మరో ఇద్దరు కుటుంబసభ్యులపై పథకం ప్రకారం దాడి
● తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న బాధితులు





చింతమానుపల్లెలో టీడీపీ శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడిన బుడ్డన్న, వీపుపై తీవ్రగాయాలు

సి.బెళగల్: మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆటో బుడ్డన్నను హత్య చేసేందుకు తెగబడ్డారు. పక్కా ప్లాన్ ప్రకారం పట్టుడు కర్రలు, ఇనుప రాడ్లతో బుడ్డన్నపై హత్యాయత్నం చేయడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఇద్దరిని చితకబాదారు. తీవ్రగాయాలతో ఎలాగోలా బయటపడిన బాధితుల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడిపై బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బుడ్డన్న మంగళవారం ఉదయం బహిర్భూమికి ఊరి చివర నున్న వంక వద్దకు ఒంటరిగా వెళ్లాడు. గమనించిన టీడీపీ నాయకులు కుమార్, వీరేష్, శివకృష్ణ, అరవిందు, హరికృష్ణ, కిష్టన్న, రాజు దాడి పథకం ప్రకారం చుట్టుముట్టారు. మలవిసర్జనకు కూర్చున్న ఆటో బుడ్డన్నపై వెంట తెచ్చుకున్న పట్టుడు కర్రలు, ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా చితకబాదారు. వీపుపై తీవ్రంగా కొట్టడంతో పాటు పాటు, కాళ్లు, చేతులు, మెడపై దాడి చేశారు. కదల్లేని స్థితిలో బుడ్డన్న కింద పడిపోవడంతో వదిలేసి వెళ్లారు. కాసేపటికి తేరుకున్న బుడ్డన్న అతికష్టం మీద ఇంటికి చేరుకున్నారు. అలాగే బుడ్డన్న కుటుంబ సభ్యులు పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తుండగా టీడీపీ గూండాలు అక్కడికి వెళ్లి ఆయన కుమారుడు వినయ్, మామ గుడప మద్దిలేటిపై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న బాధితుల కుటుంబసభ్యులు క్షతగాత్రులను సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడ ఫిర్యాదు అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుడ్డన్న పరిస్థితి విషమంగా ఉండటంతో అత్యవసర వార్డులో చికిత్స చేయిస్తున్నారు. మిగతా ఇద్దరికీ చేతులు, వీపుపై తీవ్ర గాయాలైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఘటనపై స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీస్ సిబ్బందితో చింతమానుపల్లె గ్రామంలో పర్యటించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, గ్రామంలో విచారించి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులు

టీడీపీ ప్రభుత్వం గెలవడంతో ఇకపై అంతా తాము చెప్పినట్లే జరగాలంటూ రెచ్చిపోతున్న ఆ పార్టీ నాయకులు అడ్డుగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అంతంమొందించేందుకు సైతం వెనుకాడడం లేదని బాధితులు వాపోయారు. టీడీపీ శ్రేణుల ఆగడాలతో గ్రామాల్లో ప్రశాంతత లోపించిందని, ప్రజలు భయందోళన చెందుతున్నారని, జిల్లా పోలీస్ యంత్రాంగం పల్లెల్లో గట్టి రక్షణ చర్యలు తీసుకుని ప్రశాంత వాతావరణం నెలకొనే విధంగా కృషి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

● యూటర్న్ తీసుకుంటున్న ఆటోను లారీ ఢీకొట్టడంతో ప్రమాదం
● పాణ్యం డొంగు వద్ద ఘటన



పాణ్యం డొంగు వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఆటోను ఢీకొన్న లారీ





మృతి చెందిన సుబ్బయ్య, శేషయ్య

పాణ్యం: జాతీయ రహదారిపై డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఆటోను వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఘటనపై పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణం సాయిబాబా నగర్‌కు చెందిన హమాలి కామినిపాటి సుబ్బయ్య (48), ఆటో డ్రైవర్ కం ఓనర్ కామినిపాటి శేషయ్య (54) ఆటోలో పాణ్యంకు వచ్చారు. పని ముగించుకొని తిరిగి నంద్యాలకు వెళ్లే క్రమంలో జాతీయ రహదారిపై పాణ్యం డొంగు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా నంద్యాల నుంచి బేతంచెర్లకు వెళ్తున్న ఏపీ 39 యూజే 1929 నంబర్ గల లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో బోల్తాపడి నుజ్జునుజ్జయ్యింది. ఆటోలో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పాణ్యం సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక సుబ్బయ్య మృతి చెందాడు. శేషయ్యను మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందినట్లు ఎస్ తెలిపారు. సుబ్బయ్యకు భార్య శేషమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అలాగే శేషయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆటోను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలోని సిద్ధాపురం, చుట్టుపక్కల ఉన్న అడవి, వంకల్లో నాటుసారా స్థావరాలపై సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించినట్లు సెబ్ సీఐ బి.మారుతిరావు తెలిపారు. సారా తయారీకి ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను, అలాగే 10 లీటర్ల నాటసారాను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బట్టీ నిర్వాహకులను పట్టుకునేందుకు విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా నాటుసారా తయారీ, అక్రమంగా మద్యం తరలింపు వంటి వాటికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆత్మకూరు సెబ్ ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుళ్లు జగదీష్, రమేష్, రంగస్వామి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామంలో ఎస్పీ పర్యటన



కున్నూరులో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్

గోనెగండ్ల: గ్రామాల్లోని ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని, గొడవలు పడితే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ హెచ్చరించారు. గోనెగండ్ల మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన కున్నూరులో మంగళవారం ఎస్పీ పర్యటించారు. గ్రామంలో పికెట్ పాయింట్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి పికెట్‌లో ఉన్న పోలీసులు గ్రామ ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తనతో పాటు తమ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. గ్రామ ప్రజలందరూ కుటుంబాలతో సుఖసంతోషాలతో గడపాలని సూచించారు. చిన్నపాటి విషయాలకు గొడవలు పడకుండా శాంతియుతంగా పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. అంతేగాని గొడవలు పెద్దవిగా చేసుకొని ఘర్షణలకు పాల్పడవద్దన్నారు. ప్రజల సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసులు ప్రజలతో మమేకమై సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజుయాదవ్, గోనెగండ్ల సీఐ గంగాధర్, ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

అమర వీరులను స్మరించుకుందాం

● జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్నరూత్
● పార్టీషియన్ హర్రర్స్ రిమెంబరెన్స్ డే పురస్కరించుకొని ఫొటో ప్రదర్శన



మాట్లాడుతున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్నరూత్

కర్నూలు(అగ్రికల్చర్): దేశ విభజన సమయంలో జరిగిన హింసాత్మక సంఘటనలను గుర్తుకు తెచ్చుకొని బాధితులను గౌరవించడానికి పార్టీషియన్ హర్రర్స్ రిమెంబరెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్నరూత్ పేర్కొన్నారు. మంగళవారం పార్టీషియన్ హర్రర్స్ రిమెంబరెన్స్ డే పురస్కరించుకొని కెనరాబ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. 1947 నాటి హింసాత్మక ఘటులు, బాధితుల ఫొటోలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్నరూత్, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, ఎల్‌డీఎం రామచంద్రరావు తదితరులు పరిశీలించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి మాట్లాడుతూ.. 2021 ఆగస్టు 15న ప్రధాని నరేంద్రమోదీ ఆగస్టు 14వ తేదీని పార్టీషియన్ హర్రర్స్ రిమెంబరెన్స్ డేగా ప్రకటించారని తెలిపారు. ఈ ప్రదర్శనలో విభజనకు సంబంధించి చారిత్రక చిత్రాలు, కథనాలు కళ్లకు కట్టినట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫొటో ప్రదర్శన 15వ తేదీ వరకు కొనసాగుతుందని, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు ప్రదర్శనను తిలకించాలన్నారు. కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, ఎల్‌డీఎం రామచంద్రరావు మాట్లాడారు. అనంతరం రెండు నిముషాలు మౌనం పాటించి స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వారికి నివాళులర్పించారు. సీబీఆర్‌సెటీ డైరెక్టర్ పుష్పకుమార్, లీడ్ బ్యాంకు సిబ్బంది శైలప్ప, అనిల్‌రెడ్డి ఎఫ్ఎల్‌సీ, సీఎఫ్ఎల్ కౌన్సిల్స్, ఎక్స్‌సర్వీస్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

బకెట్‌లో పడి చిన్నారి మృతి

దేవనకొండ: మండల కేంద్రంలోని బిల్డింగ్ కాలనీలో గానవి (4) అనే చిన్నారి బకెట్‌లో పడి మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. తల్లిదండ్రులు మారెన్న, సుమలత దంపతులు కుమార్తె గానవిని అవ్వ దగ్గర వదిలి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. చిన్నారి ఆడుకుంటూ బాత్‌రూమ్‌లో ఉన్న నీటి బక్కెట్‌లో పడింది. బయటకు రాలేక ఊపిరి అందక చనిపోయింది. చిన్నారి ఎక్కడో ఆడుకుంటుంది అనుకుంటున్న అవ్వ ఎంతసేపటికీ ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల అంతా వెతికింది. చివరకు బాత్‌రూమ్ తలుపు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా చిన్నారి బకెట్‌లో శవమై కనిపించింది. బుడిబుడి అడుగులతో ఇల్లంతా సందడిగా తిరిగే చిన్నారి శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు.

20 నుంచి ఓటరు జాబితా సవరణ

● అక్టోబర్ 18వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమం
● ఇంటింటికీ వెళ్లి పరిశీలించనున్న 2186 మంది బీఎల్‌ఓలు
● 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పన
● వివరాల మార్పు, చేర్పులకు సదావకాశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటరుజాబితాలోని తప్పొప్పులను సరిదిద్దుకోవడానికి భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇందుకోసం ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇళ్లకు వచ్చే బీఎల్‌ఓలకు ప్రజలు సహకరించాలని కోరింది.

మార్పులు, చేర్పులకు అవకాశం

2024 ప్రత్యేక ఓటరు సవరణ జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 20,54,524 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 10,13,771 మంది పురుష ఓటర్లు కాగా, 10,40,435 మంది మహిళా ఓటర్లు, 318 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్ల సంఖ్యతో పోల్చుకుంటే మహిళా ఓటర్ల సంఖ్య 26,664 ఎక్కువగా ఉంది. జిల్లాలోని కర్నూలు, పాణ్యం, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో పాత ఓటర్ల జాబితాపై విచారణతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు బీఎల్‌ఓలు దరఖాస్తులను స్వీకరిస్తారు. అంతేగాక జాబితాలోని బోగస్ ఓట్ల ఏరివేత, ఇప్పటికే ఉన్న పేర్లు, అడ్రస్సుల్లోని తప్పొప్పులు, మార్పులు, తొలగింపులు, నియోజకవర్గాల మార్పిడి, ఫొటో మార్పిడి, మరణించిన వారిని జాబితా నుంచి తొలగించడం తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు.

అక్టోబర్ 29న ముసాయిదా జాబితా ప్రకటన

ప్రత్యేక ఓటరు నమోదు సవరణ 2025లో భాగంగా అక్టోబర్ 29వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాపై అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 24వ తేదీ నాటికీ అభ్యంతరాల పరిశీలన పూర్తి చేసి 2025 జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు.

దరఖాస్తులను ఎక్కడ ఇవ్వాలి?

కొత్తగా ఓటరు నమోదు కోసం లేదా ఫిర్యాదులపై ఇంటికి వచ్చే బీఎల్‌ఓకు దరఖాస్తు ఇవ్వవచ్చు. లేదంటే ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్ రోజుల్లోనూ అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆయా రోజుల్లో జిల్లాలోని 2186 పోలింగ్ బూతుల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు. లేకపోతే స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లోనూ దరఖాస్తులను సమర్పించవచ్చు. బూత్ లెవల్ ఆఫీసర్లకు సమర్పించినా సరిపోతుంది. లేదంటే ఆన్‌లైన్‌లో కూడా స్వయంగా దరఖాస్తు పెట్టుకోవచ్చు. WWW.NVP.IN లేదా ఓటరు హెల్ప్‌లైన్ అనే మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

అక్టోబర్ 29న ముసాయిదా జాబితా విడుదల

స్పెషల్ సమ్మరీ రివిజన్–2025కు సంబంధించి అక్టోబర్ 29వ తేదీ నాటికీ ముసాయిదా జాబితాను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ కలెక్టర్లను ఆదేశించారు. ఆయన మంగళవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఎస్ఆర్–2025పై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎస్ఆర్–2025లో భాగంగా బీఎల్‌ఓలు ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి ఓటరు సర్వే చేయాలన్నారు. అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అక్టోబర్ 29న ముసాయిదా జాబితాను విడుదల చేయాలన్నారు. ముసాయిదా జాబితాపై నవంబర్ 28వ తేదీ వరకు రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. డిసెంబర్ 24వ తేదీలోపు వచ్చిన అభ్యంతరాలపై పరిశీలన చేసి 2025 జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటించేలా జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌మన్ ఆత్మహత్య

పెద్దకడబూరు: రైల్వే ట్రాక్‌మన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్‌కు చెందిన శివలింగప్ప (57) రైల్వేలో ట్రాక్‌మన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రైల్వేకు సంబంధించిన లారీలో వెనక కూర్చొని గుంతకల్లు నుంచి రాయచూర్‌కు వెళుతున్నాడు. మధ్యాహ్నం 1.30 గంటలక చిన్నతుంబళం సమీపంలో వెళుతుండగా శివలింగప్ప లారీ టాప్‌పై ఉన్న ఐరన్‌రాడ్‌కు ఉరి వేసుకున్నాడు. వెనక వచ్చిన వాహనదారులు గమనించి డ్రైవర్‌కు విషయం తెలిపారు. ఆయన మృతుడి కుటుంబ సభ్యులకు, రైల్వే అధికారులకు ఫోన్ ద్వారా విషయం తెలిపి మృతదేహాన్ని గుంతకల్లుకు తీసుకెళ్లారు. అక్కడి పోలీస్‌లు విచారణ చేపట్టి ఘటన జరిగిన ప్రదేశం పెద్దకడబూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ మంగళవారం గుంతకల్లుకు వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. మృతుడి కుమారుడు లింగప్ప ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE
■ కర్నూలు టు నంద్యాల రోడ్‌లో ఓర్వకల్లు బైపాస్ ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీలో అన్ని సౌకర్యాలతో 3 సెంట్ల ప్లాటు కేవలం 10 లక్షలు మాత్రమే. ఫ్రీ సైట్ విజిట్ కొరకు సం.ప్ర: 9182821014 [L-796441]

SERVICES

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6536]

SECOND SALE
■ స్కూల్ మరియు కాలేజీలకు అవసరమైన విద్యార్థుల క్లాసు రూమ్‌లో చదువుకునే మంచి నాణ్యమైన పాత బెంచీలు అమ్మబడును. కావలసిన వారు సంప్రదించగలరు. 92487 33342 ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి. [G-5597]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09165
70750 09185

BUSINESS OFFER
■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

WANTED
■ ప్రముఖ కంపెనీ నందు పనిచేయుటకు వాటర్ గీజర్ టెక్నీషియన్ కావలెను. మంచిజీతం కలదు. సం.ప్ర: కర్నూలు, నంద్యాల. ✆ 9985825581, 9392189251. [L-796526]

■ SBI Lifeలో పార్ట్/ఫుల్ టైంగా మీకు అనుకూలమైన సమయంలో పనిచేసుకుంటూ.. ప్రతి నెల 20 వేలు నుండి 50 వేలు వరకు సంపాదించుకునే అద్భుత అవకాశం ఎవరు అర్హులు: రిటైర్ ఉద్యోగస్తులు, వాలంటీర్లు, రియల్ ఎస్టేట్స్, వ్యాపారస్తులు, గృహిణులు, ప్రైవేట్ ఉద్యోగులు కమీషన్ ఏజెంట్స్ RMP డాక్టర్స్ bo/CSC పాయింట్స్ మొదలగు వారు. సం.ప్ర: 9133144244. [L-796442]

■ Site Supervisor with Civil Engineering/ Diploma qualification at Nandyal. Minimum experience of 1-3 years in site supervision and quality control work. Contact : Cell: 8333929186. [A-320]

■ హైదరాబాద్‌లో జాబ్స్: సేల్స్ గర్ల్స్ జీతం: 15K + TA ఇన్సెంటివ్స్, ఫ్రీ రూం + భోజనం, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ జీతం: 20K+TA+DA ఇన్సెంటివ్స్. RINAN ఫోన్: 9505393395, 9347311065 [HA-796149]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం, HYD. ఫోన్: 9182280297 [HA-98151]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K, ఫోన్ : 9160900024, 9640400073 [H-796267]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.